# పిల్లలు మాయమైన వేళ...

అదొక లోకం.

జాబిల్లి తారల చుక్కలు పెట్టి వెన్నెల ముగ్గులు వేస్తోంది.

పారిజాతాల ఘుమఘుమలు పరిమళాలు నింపుతున్నాయి.

పక్షుల కువకువలు నేపథ్య సంగీతం సమకూర్చుతున్నాయి.

ఆ సంగీతానికి సరిధీటుగా అలసిపోయేదాకా నాట్యం చేసిన అందాలరాణి సిండ్రెల్లా-తన పాడవాటి గులాబిగౌను కుచ్చిళ్ళు జాగ్రత్తగా ఎత్తిపట్టుకొని, తన కుడిచేతిని రాకుమారుడికి సుతారంగా అందించింది. ఆవిడ గాజుజోళ్ళు ఘుమ్‌మంటోంటే వయ్యారంగా ముందుకు కదిలింది. సన్నగా వీస్తోన్న గాలిలోని పలుచని సువాసనకు పరవశమవుతూ వారు సెలయేటి ఒడ్డుకు వచ్చి కూర్చున్నారు.

అప్పటికే స్నోవైట్, గోల్డీలాక్, స్లీపింగ్‌బ్యూటీ, రాకువారులు, రాకుమార్తెలు మరుగుజ్జుమిత్రులు...అంతా వచ్చేసారు. తమ జెన్నీ భూతంలో సహా అల్లావుద్దీన్-జాస్మిన్ వచ్చేసారు.

ఇంతలో సింద్‌బాద్-గలీవర్ రావడంతో-అప్పటిదాకా కబుర్లు చెప్పుకుంటోన్న వాళ్ళంతా - ఆ సాహసవీరుల వైపు దృష్టి సారించారు. ఆశ్చర్యంతో పెద్దవుతోన్న కుసుమకోమలుల కళ్ళ మెరుపులకు మురిసిపోయి.. ఆ సాహసవీరులు ఛాతీలు విరుచుకొన్నారు. గొంతులు సవరించుకొన్నారు. పోటీలు పడుతూ ఉత్సాహంగా తమతమ సాహసాలు ఏకరువు పెట్టసాగారు.

అయితే, ఈ విషయాల్లో వీరందరికన్నా అదృష్టవంతుణ్ణి తనేనన్నాడు అప్పుడే వచ్చిన మారుఫ్.

ఇంతలో సరిమువ్వ గజ్జెలు ఘల్లుఘల్లు మన్నాయి. చేత వెన్న ముద్దతో చిన్ని వేణువుతో బుడిబుడి నడకల బుజ్జికృష్ణుడు - అతని వెనకనే ఓ చిట్టి గట్టి గదను మోస్తూ బాలభీముడు రానే వచ్చారు.

వీళ్ళందరినీ ఒక్కసారిగా చూసిన సంతోషంలో బోసినవ్వులు నవ్వుతూ వెన్నెల చెట్టు కింద ముసలమ్మ వడివడిగా రాట్నం వడుకుతోంది. ఆవిడ పెంపుడు కుందేలు అటూ ఇటూ గెంతులు పెడుతోంది.

పూటకూళ్ళ పెద్దమ్మ విందుభోజనాల ఏర్పాటుతో హడావుడి పడుతూ అట్లు పోసి పెట్టమని - చెట్టు కింది ముసలమ్మని పురమాయించింది.

"రావాల్సిన వాళ్ళంతా వచ్చేసి నట్లేనా?" ఎవరో అడిగారు.

"వచ్చే వాళ్ళు వస్తూనే వున్నారు. ఇంకా ఎంతసేపని వేచివుంటాం? విందుకు వేళవదూ?" అన్నాడు బాలభీముడు తన బొజ్జను అప్రయత్నంగా తడుముకుంటూ.

అదొక లోకం.

తమ స్వప్నాల రథాలపై పయనమై అలవోకగా వారిని పలకరించగలిగే చిట్టి పాపాయిలందరికీ ఆ లోకం తెలుసు.

పిల్లలుగా ఉన్నప్పటి పెద్దలకీ తెలుసు.

అయితే మునుపటిలా కాకుండా - ఇప్పుడు ఆ లోకానికి చిన్నారి పాపాయిల రాకపోకలు పలుచబడిపోయాయి. దాని వెనుక కారణాలేమిటో తెలియక దిగాలు చెందిన ఆ లోకవాసులంతా ఆ వెన్నెల రాత్రి సెలయేటి ఒడ్డున సమావేశమయ్యారు.

తన అందమైన నాట్యం చూసేవాళ్ళే కరువయ్యారని అందాలరాశి సిండ్రెల్లా వాపోయింది.

వెన్న ముద్దలు-వెన్నెల సుద్దులు-వేణుగానాలు పంచుకొనేవాళ్ళే లేకుండా పోయారని బాలకృష్ణుడు మూతి ముడిచాడు.

"ఇంతకీ మన చిట్టి స్నేహితుల్ని కట్టిపడేస్తున్న ఆటంకాలేమిటో?" సాలోచనగా అంది జాస్మిన్.

"రాకుమారీ - నన్ను వివరించమంటారా?" వినయంగా అడిగాడు భేతాళుడు - ఎప్పుడు వచ్చాడో ఏమో కానీ.

"వద్దులే మహానుభావా...నోటికొచ్చిన విషయమేదో చెప్పి తలతిక్క ప్రశ్నలేసి సమాధానం చెప్పకపోతే తల వెయ్యివక్కలు చేస్తానంటావ్! ముందు నువ్విలా రా!" అంటూ జెన్నీ భూతం భేతాళుడి చెయ్యి పట్టుకొని పూటకూళ్ళ పెద్దమ్మ దగ్గరకి లాక్కెళ్ళాడు.

పూటకూళ్ళ పెద్దమ్మ ఇద్దర్నీ రోటి దగ్గర కూర్చోబెట్టింది. పప్పురుబ్బనూ-మసాలాలు నూరనూ.

"అయితే నేను వారి దగ్గరకి వెళ్ళి విషయమేమిటో కనుక్కురానా?" ప్రయాణాలు చేసి చాలా కాలమైందేమో ఉత్సాహంగా అడిగాడు సింద్‌బాద్.

''నేనూ సిద్ధమే!'' అన్నాడు మారుఫ్.

''మీరిద్దరూ ఆగాలి! ఇది నావికుల కాలం కాదు. విమానాలు-కార్లు- మీరు ఇమడలేరు బాబూ...నేను వెళతాను!'' గలీవర్ కోటు కాలరు సర్దుకొంటూ అన్నాడు.

''ఆయ్!'' బాలభీముడు గర్జించాడు ''ఎవరు వెలితే ఏం? విషయం త్వరగా తేల్చుకోవడం ముఖ్యం!''

ఇంతలో ఎక్కడి నుంచో సన్నని సన్నాయి పాట వారి చెవుల్ని తాకింది.

నాదస్వరం విన్న నాగినులలాగా సుందరీమణులు కదిలారు. వారి వెనకే రాకుమారులు వారి వెనక మిగిలిన వారంతా.

వెన్నెల చెట్టు కింద తారల రెమ్మల కింద పైడ్‌పైపర్ కూర్చుని తన సంగీత సాధన చేసుకుంటున్నాడు.

అందర్నీ చూసి అతను సంతోషంతో లేచి నిల్చున్నాడు.

తన్మయత్వంలోంచి అందరూ ఒక్కసారిగా బయటపడ్డారు.

అతను మోకాళ్ళపై వంగి అందరికీ ధన్యవాదాలు చెప్పాడు.

చిట్టి వేణువును ముందుకు చాస్తూ చిన్నికృష్ణుడు చిద్విలాసంగా నవ్వుతూ అన్నాడు. ''మన మిత్రులను కలవడానికి ఇతనే సరియైనవాడు. లోగడ ఓ మారు పిల్లలందరినీ మాయచేసి మాయం చేసిన ఘనత ఆయనకు ఎలాగూ వుందయ్యే...''

పూర్వం హామ్లిన్ నగరాన్ని పట్టి పీడించిన ఎలుకల పీడను తన సన్నాయి స్వరంతో వదిలించింది ఈయనే. అయితే ముందు చెప్పిన బహుమానం ఇవ్వకుండా రాణీగారు మొండి చేయి చూపారు. తన మహిమగల సన్నాయినాదంతో నగరంలోని పిల్లల్ని మాయం చేసి - రాణీగారికి బుద్ధి చెప్పిన ఘనుడాయన.

అందుకే చిన్నికృష్ణుని మాటకు అవునంటే అవున్నారు అందరూ.

అంతా కలిసి పైపర్‌ను ఆ నగరంలోని ఓ ప్రముఖ పుస్తకాల షాపు వరకూ సాగనంపారు. ఏం అవసరం వచ్చినా తామంతా అతని వెనకే వున్నామని గుర్తుంచుకోమన్నారు.

అలా ఆ పైపర్ షాపులోని పుస్తకాల దొంతరలో ముందుకు వచ్చి నిల్చున్నాడు. కుతూహలంగా చుట్టూ చూసాడు.

పుస్తకాలు అమ్మేవాళ్ళు - కొనడానికి వచ్చేవాళ్ళు - చూసివెళ్ళేవాళ్ళు -

బేరాలాడేవాళ్ళు - అటూ ఇటూ తిరుగుతున్నారు. అడపాదడపా ఓ పుస్తకం బయటకు పోతోంది.

ఇంతలో ఓ చిన్నపాప తిన్నగా వచ్చి - పైపర్ వున్న పుస్తకం చేతుల్లోకి తీసుకుంది.

తంతే గారెలబుట్టలో పడ్డట్లయింది పైపర్ పని. సంతోషంగా తనలో తనే నవ్వుకున్నాడు.

ఆ పాప తన బొద్దు వేళ్ళతో అతగాడి రంగురంగుల కోటును తడిమి చూసింది. అతని టోపీ పైని ఎర్రని పొడవాటి ఈకను తాకి చూసింది. అతని చేతుల్లోకి వాయిద్యాన్ని ముట్టుకోబోయి-

''చిట్టీ ఇలారా'' ఎవరో గట్టిగా కేకయడంతో - ఆగిపోయింది.

''నువ్వేరా మమ్మీ'' చిట్టిబదులుగా అరిచింది ''మమ్మీ... ఇలా చూడు ... ఈ బొమ్మ ఎంత బావుందో..మమ్మీ...మమ్మీ...నేనీ పుస్తకం తీసుకొంటానే!''

''మళ్ళీ తీసుకుందాంలే...వచ్చేసేయ్!'' వాళ్ళమ్మ గద్దించింది.

''ఏం వద్దు..ఇప్పుడే తీసుకొందాం!'' చిట్టి బుంగమూతి పెట్టి గారాలు పోయింది.

పైపర్ పిల్లల్ని ఆకర్షించడంలో తనకున్న శక్తికి తనే ఆనందించాడు.

చిట్టి వాళ్ళమ్మ గబగబ వచ్చింది. చిట్టి చేతుల్లోని పుస్తకం తీసుకొని విసురుగా పేజీలు తిరగేసింది. అదే వేగంతో ర్యాక్ పైకి విసిరేసింది.

''ఇదుగో చిట్టీ...నీకింకా చాలా పుస్తకాలు కొనాలి. ఆ కథ నాకొచ్చు. నేను చెపుతాగా...పద!''

''ఏం వద్దు! నువ్వెప్పుడూ ఇలాగే అంటావ్. తరువాత ఏమీ చెప్పవ్!'' చిరుకోపంతో చిట్టి కంఠం బొంగురు పోయింది.

''అసలు క్లాసు పుస్తకాలు చదవడానికీ...హోంవర్కులు చేయడానికే టైం లేక చస్తుంటే - ఇవ్వన్నీ ఎందుకే? చదివేదీ లేదూ పెట్టేదీ లేదు. పదపద'' చిట్టివాళ్లమ్మ చిట్టిని బరబరా లాక్కెళ్ళింది.

పైపర్ ఉసూరు మన్నాడు.

చిట్టి బోలెడన్ని క్లాసుపుస్తకాలు కొంటోంది. పైపర్ చప్పున వెళ్ళి ఓ పుస్తకంలో దాక్కున్నాడు.

చిట్టి గునుస్తూనే వాళ్ళమ్మతో పాటు బయటకు నడిచింది.

చిట్టి వాళ్ళమ్మ వేగంగా నడుస్తోంది. పైగా ఓ చేత్తో చిట్టిని లాగుతోంది. ఆ వేగంతోనే పుస్తకాల సంచి - సంచిలో వున్న పైపర్ కదులుతున్నారు. కాసేపటి తరువాత - పైపర్ ఎలానో తమాయించుకొని - లేచి - సంచి అంచులు పట్టుకొని చుట్టూ చూసాడు.

ఎవరో పిల్లాడు పక్షిపిన్నుల అట్టల్ని విసనకర్రలా పట్టుకొని కొనమని అడుగుతున్నాడు. మరో పిల్లాడు తన దగ్గరున్న రబ్బరుబాండ్లు కొనమంటున్నాడు. చిట్టి వాళ్ళమ్మ ఏమీ వద్దని ముందుకు కదిలింది.

వాళ్ళు వెంబడించారు. బతిమిలాడారు. ఖరీదు తగ్గించారు.

ఆవిడ ఓపికగా అవేవీ తనకు వద్దని - తనను వదిలేయమని చెప్పి - పక్క సందులోకి తిరిగింది.

చిట్టికి అన్నీ కొనేసుకోవాలనుంది.

అలాకాస్త దూరం వెళ్ళారో లేదో ఒకమ్మాయి కొత్తిమీరకట్టలు చేతిలో పట్టుకొని వెంబడిస్తే - మరో చిన్నిపాప నిమ్మకాయలతో వెంబడించింది.

చిట్టివాళ్ళమ్మ వాళ్ళను వదిలించుకోవాలని ప్రయత్నించే కొద్దీ వాళ్ళు మరింత వెంట పడుతున్నారు. ఇంతలో ఆ కొత్తిమీరకట్టమ్మాయి చటుక్కున చిట్టి వాళ్ళమ్మ కాళ్ళమీద పడి కొనమంటూ దండాలు పెట్టింది.

చిట్టికి ఇదంతా సరదాగా వుంది. వాళ్ళమ్మకేమో కంపరంగా వుంది.

వాళ్ళను విదిల్చుకొని - చిట్టిని తొందర పెడుతూ - పరిగెత్తినంత వేగంగా వెళ్ళి - ఆగివున్న ఆటోలో కూలబడింది. ఆటో ముందుకు కదిలింది.

పైపర్ ఆ పిల్లలు కనుమరుగయ్యే వరకూ చూసాడు. వాళ్ళ మొహాల్లో నిరాశ కొట్టొచ్చినట్లు కనిపించింది.

''పాపం! అవి అమ్మకపోతే ఏం ఇబ్బందులున్నాయో!'' పైపర్ నిట్టూర్చాడు.

ఆటో రైల్వేస్టేషన్ వైపు వెళుతోంది.

దారంతా మాయాబజారు లాగుంది. ఎక్కడ చూసినా పిల్లల సరుకులు అమ్మే దుకాణాలే కన్పిస్తున్నాయి. పిల్లల బట్టలు - బొమ్మలు - ఆటవస్తువులు - బేకరీలు - ఐస్‌క్రీం షాపులు. ''అయ్యబాబోయ్... అవ్వన్నీ పిల్లల కోసమే!'' పైపర్ ఆసక్తిగా చూస్తున్నాడు.

ఇక చిట్టికి సందేహాన్నీ వచ్చేస్తున్నాయి.

''అంత పెద్ద బిల్డింగ్ ఎలా నిలబెడతారో?'' ఓ ఎత్తైన భవనాన్ని - ఆటోలోంచి తలవంచేసి మరీ - చూసి ఆశ్చర్యపోయిందీ.

పైపర్ నోరు తెరుచుకొని ఆ భవనాన్ని చూసాడు.

ఒక దాన్ని మించి ఒకటి. ఆ వీధంతా భవనాలు బారుతీరివున్నాయి.

వాళ్ళ సందేహాలు తీరడానికా అన్నట్లు ఓ నిర్మాణంలో వున్న కట్టడం కనిపించింది. చిట్టి హుషారుగా చప్పట్లు కొట్టింది. పైకి ఇటుకలు మోస్తూ ఆగిన అమ్మాయి ఎవరో చిట్టికి చేయి ఊపింది.

''అయ్యో బాబాయ్... ఎంత బరువో!'' ఆ అమ్మాయి తల మీద తట్టను చూసి కళ్ళు తేలేసాడు పైపర్.

చిట్టి ఆ అమ్మాయికి చేయి ఊపుదామనుకొనే లోపలే ఆటో ముందుకెళ్ళిపోయింది.

ఆటో తిన్నగా వెళ్ళి రైల్వేస్టేషన్ దగ్గర ఆగింది.

ఇవ్వాళ్టి రైల్లో చిట్టి వాళ్ళ చుట్టాలు వస్తున్నారు. అదీ విశేషం.

చిట్టి, వాళ్ళమ్మ ఆటో దిగే లోపలే పైపర్ నాలుగువైపులా కలియచూసాడు. గోలగోలగా వుంది. పాపం ఇక్కడా చిట్టి వాళ్ళమ్మకి బెడద తప్పేట్టు లేదు.

బఠాణీలు అమ్మే పిల్లాడు - ఇడ్లీలు అమ్మే అమ్మాయి - నీళ్ళసీసాల అబ్బాయి - పుస్తకాలు అమ్మే అమ్మాయి - చంకన చంటి బిడ్డల్నేసుకొని అడుక్కొనే అర్భకప్పిల్లలు - చిన్న చిన్న చీపుర్లతో చకచక చిమ్మేతూ చేయిచాపే చింపిరి పిల్లలు - ఒకళ్ళేమిటి - అందరూ ఆవిణ్ణే చుట్టుముట్టి ఊపిరి పీల్చుకోనివ్వడం లేదు.

చిట్టి వాళ్ళమ్మకి చిరాగ్గా వుంది.

పైపర్‌కి దిగులుగా వుంది. ఆ దిగులు చిట్టి వాళ్ళింటికి వెళ్ళాక మరింత పెరిగిపోయింది.

చిట్టికేమో చుట్టాలమ్మాయితో ఆడుకోవాలని సరదా. కొత్తకథ చెప్పించుకోవాలని ఆశ.

చిట్టి వాళ్ళమ్మ కేమో చిట్టి హోంవర్క్ పూర్తి చేయలేదని బెంగ. పై నుంచి కథలు కాకరకాయలు చిట్టి చదువును చట్టు బండలు చేస్తాయని ఆవిడ ప్రగాఢ విశ్వాసం

చివరికి బుగ్గమీద వాతలతో... చిట్టి ఒంటరిగా తన గదిలో వెక్కివెక్కి ఏడుస్తూ పడుకోవాల్సి వచ్చింది. చిట్టి వెక్కిళ్ళ మధ్యనే తల్లి తనకు చెప్తానన్న కథను కలవరిస్తోంది.

పైపర్ ఉసూరుమన్నాడు. విచారంలో మునిగిపోయాడు.

పిల్లలు - పిల్లలు - పిల్లలు.

ఎక్కడ చూసినా పిల్లలు.

ఆ స్టేషన్లలోని పిల్లలంతా చెత్తను శుభ్రం చేయడం మానేసిన రోజున రైల్వేవారు ఎంతమంది సిబ్బందిని పెట్టుకోవాల్సి వుంటుందో!

ఇక ఆ ఇరానీ హోటల్లో కుర్రాళ్ళు! ఒక్కోడు ఆ ఇరుకు టేబుళ్ళ మధ్యన రోజుకు కనీసం ఇరవై ముప్పైమైళ్ళన్నా నడవడా?

మన కార్మికశక్తిలో సగం - పిల్లలు.
మన కర్షకశక్తిలో సగం - పిల్లలు.
మన ఉత్పత్తిదారుల్లో సగం - పిల్లలు.
మన వినియోగదారుల్లో సగం - పిల్లలు.
మన ఆశలూ ఆశయాలు - పిల్లలు.
మన ఆనందాలు అనుబంధాలు - పిల్లలు.
పిల్లలు - పిల్లలు - పిల్లలు.

ఈ పిల్లలకి బదులుగా ఏం ఇస్తున్నాం? బతుకుల బరువులు - చదువులబరువులు. పైనుంచి, పసితనాన్ని చిదిమివేసే చీకటి పనులు, చిన్నతనాన్ని అడ్డం పెట్టుకొని చేయించే చిల్లరపనులు - ఇవేనా వారికి అందుతోన్న బహుమానాలు?

ఆలోచించి ఆలోచించి పైపర్ బుర్ర వేడెక్కిపోయింది. చిక్కనవుతున్న విషాదంలో ఆయన ఆలోచనలకు అంతు చిక్కడం లేదు. తెలియకుండానే కళ్ళు చెమ్మగిల్లాయి.

అయ్యో....పిల్లలు! ఆయన నిట్టూర్చాడు.

ఈలోగా - పైపర్ వాళ్ళ లోకంలో అలజడి పుట్టింది. వెళ్ళిన పెద్దమనిషి వెళ్ళినట్లే వెళ్ళాడు. ఆజాపజాలేదేమిటి చెప్మా - అనుకొంటూ చందమామని చూచిరమ్మని పంపారు.

సరిగ్గా పైపర్ ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చేసరికి - చందమామ కొండెక్కి వచ్చాడు.

పైపర్ తను తెలుసుకున్న విషయాలను - తీసుకున్న నిర్ణయాన్ని చందమామకు చెప్పాడు. చందమామ తారలతో తమ మిత్రులకు సందేశం పంపాడు. వాళ్ళకళ్ళు తడికడుతుండగా అదే సరియైన పని అని తలాడించారు.

చందమామ పైపర్ వెన్ను తట్టాడు. వెన్నెల మెట్లు పరిచాడు.

పైపర్ తన మహిమ గల వాయిద్యం తీసి సవరించాడు. వాయించడం మొదలు పెట్టాడు. చిన్న పిల్లలు పెద్ద పిల్లలు పరుగులు పెడుతూ వచ్చేసారు.

చిట్టిపాపలు బుజ్జిబాబులు బిలబిలమంటూ వచ్చేసారు.

అర్భకపు పిల్లలు అనారోగ్యపు పిల్లలు గెంతులు పెడుతూ వచ్చేసారు.

గుంపుల గుంపుల సీతాకోకచిలుకలు ఒక్కసారిగా కదిలినట్లుగా వెన్నెల మెట్లు కళకళలాడి పోయాయి.

ఆ లోక వాసులంతా పిల్లల్ని ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆనందంగా హృదయాలకు హత్తుకున్నారు. చివరిగా చిట్టి చేయిపట్టుకొని పైపర్‌కూడా తమ లోకానికి వెళ్ళిపోయాడు. అందరూ చేరారో లేదో చూసుకొని చందమామా కదిలిపోయాడు.

భళ్ళున తెల్లవారింది.

తల్లుల గుండెలు గుభిల్లన్నాయి.

పిల్లలు లేని ఇళ్ళు బావురుమన్నాయి.

వీధులన్నీ గగ్గోలెత్తి పోయాయి.

పిల్లలేరి?

పిల్లలు - పిల్లలు - పిల్లలేరి?

ఆక్రోశిస్తున్నారు. అన్వేషిస్తున్నారు.

ఒక్కసారిగా పిల్లలంతా మాయమయ్యారు. ఎలా? ఎక్కడికి? ఎవరిదీ పని?

తాగే పిల్లల్లేక తల్లుల గుండెలు బరువెక్కిపోయాయి. ఊగేవాళ్ళు లేక ఉయ్యాలలు బోసి పోయాయి. పాలప్యాకెట్లు గుమ్మాల దగ్గరే పడున్నాయి.

న్యూస్ పేపర్ లేదు - పేపర్ పిల్లవాడు లేడు.

బడి లేదు. బడికి పిల్లల్ని తీసుకెళ్ళే బస్సులేదు. రిక్షాల్లేవు. రైళ్ళులేవు. కంట్రాక్టర్లు కళ్ళు తేలేసారు, బ్రోకర్లు చేతులెత్తేసారు.

ఫ్యాక్టరీలు తెరవనే లేదు, వ్యవసాయపుపనులు ఆగిపోయాయి.

ఊరు ఊరే స్తంభించిపోయింది. ఊపిరి పీల్చడం మర్చిపోయింది.

చిలుక పలుకులు లేవు. బుడిబుడి నడకలు లేవు. అలగడాలు లేవు. మారాం చేయడాలు లేవు. తల్లి కొంగులాగే వారు లేరు. చాక్లెట్లు బిస్కట్లు తినేవారు లేరు.

ఊరే వట్టిపోయినట్లుంది.

విచిత్రమేమిటో చూద్దామని వచ్చిన సూర్యభగవానుడికీ ఆ వూరిలో మనసేం పొసగినట్లు లేదు. పరుగులు పెట్టి పారిపోయాడు.

ఇక ఆ లోకం చేరిన పిల్లలది సందడే సందడి.

ఒకడు చిన్ని కృష్ణుడి దగ్గర వేణువు వూదడం నేర్చుకుంటున్నాడు... కొంతమంది బాలభీముడి వద్ద కుస్తీపట్లు నేర్చుకుంటున్నారు. మరికొందరికి సిండ్రెల్లా నాట్యం నేర్పుతోంది. పైపర్ వాయిద్యాన్ని ఒకరు పరిశీలిస్తుంటే అల్లావుద్దీన్ దీపాన్ని మరొకరు పరీక్షిస్తున్నారు.

సింద్‌బాద్ - గలీవర్ - మారుఫ్‌ల హడావుడి చెప్పక్కరలేదు. సభలే పెట్టేసారు.

ఊహల ఉయ్యాలూగే వాళ్ళు - సీతాకోకచిలుకలపై సవారి చేసేవాళ్ళు - ఇంద్రధనుస్సులపై జర్రున జారేవాళ్ళు - మేఘాల పరుపులపై పవళించేవాళ్ళు - తారల్ని మాలకట్టి తల్లో పెట్టుకొనేవాళ్ళు -!

సంతోషం - సంబరం - ఉత్సాహం - ఉల్లాసం!

అబ్బో..అబ్బబ్బో!

పైపర్ తను చేసిన ఘనకార్యానికి సంతోషిస్తుంటే...పూటకూళ్ళ పెద్దమ్మ - రాట్నం ముసలమ్మ అతనికి చెరో పక్క చేరారు. ఏవైనా పిల్లల్ని తల్లుల్ని విడదీయడం మాత్రం బావుండ్లేదని ఇద్దరూ ఒకేసారి బుగ్గలు నొక్కుకున్నారు.

''నాకు మాత్రం సరదా ఏంటీ? పెద్దలకి ఓ చిన్న గుణపాఠం నేర్పుదామనే ఇదంతా! నేనిప్పుడే వాళ్ళ పెద్దల దగ్గరకి వెళ్తా. మీరు విందుభోజనాల సంగతి, పాలబువ్వల సంగతి చూస్తారుగా!''

పైపర్ పెద్దల దగ్గరకి బయలు దేరాడు.

ఇక ఇక్కడ-

పెద్దల ఆక్రందన తారాస్థాయికి చేరుకుంది. ఏడ్చి ఏడ్చి తల్లుల గొంతులెండి పోయాయి. వెతికి వెతికి తండ్రుల కాళ్ళరిగిపోయాయి.

పెద్దలంతా ఓ చోట సమావేశమయ్యారు. ఏవీ చేయడానికి పాలు బోవడం లేదు. ఇంతలో... ఓ గడ్డం నెరిసిన పెద్దాయనకు ... ఒకానొకప్పుడు ఏదో నగరంలో ఓ మాయల మారి వాయిద్యగాడు పిల్లలందరినీ మాయం చేయడం గుర్తొచ్చింది. ఆయన ఆ విషయం చెప్పబోయే లోపలే - పైపర్ అక్కడికి వచ్చేసాడు.

''పిల్లల విషయం నాకు తెలుసు!'' గంభీరంగా అన్నాడు పైపర్.

''నిజంగా?'' కొందరు ఆనందంతో అరిచారు. కొందరు అనుమానంతో కనుబొమలు ముడిచారు.

''ఎంత చల్లని మాట! పిల్లలు క్షేమమేకదా?'' ఓ తల్లి ఆత్రంగా అడిగింది.

పైపర్ ఆవిడకూ మిగిలిన తల్లులకూ నమస్కరించాడు.

''అమ్మా..మమ్మల్ని మన్నించండి. పిల్లల్ని మేమే తీసుకెళ్ళాం. వాళ్ళు మాలోకంలో ఎంతో హాయిగా వున్నారు.''

అప్పటికి దాకా వున్న ఆందోళన కొందరిలో ఆగ్రహంగా మారింది. కట్టలు తెంచుకున్న కోపంతో అతని మీదకు ఉరకబోయారు. మిగిలినవాళ్ళు కలగజేసుకొని వాళ్ళని శాంతింప చేసారు. పైపర్ వారిని చిరునవ్వుతో చూస్తూ వుండిపోయాడు.

పిల్లలు క్షేమమని తెలిసింది కనుక నిమ్మళించిన మనసుతో - ఎందుకలా చేసారని పైపర్‌ను ప్రశ్నించారు. పైపర్ నెమ్మదిగా అన్నాడు-

''అమ్మల్లారా...అయ్యల్లారా...మేం పుట్టింది బతుకుతోంది పిల్లల కోసమే. మాదీ పిల్లలదీ విడదీయరాని బంధం. ఎందుచేతనో ఇప్పటి పిల్లలకు మాతో సంబంధాలు పలుచబడ్డాయి. కారణాలు కనుక్కురమ్మని మావాళ్ళంతా నన్ను పంపించారు.''

అందరూ పైపర్ మాటలు కుతూహలంగా వింటున్నారు. పైపర్ గొంతు సవరించుకొని కొనసాగించాడు.

''ఇప్పుడు పిల్లలు పిల్లల్లా లేరు. పువ్వుల్లా విరియాల్సిన మొగ్గల్లా లేరు. ఈ తూకంబతుకుల లోకంలో వ్యాపారదృక్పథ ప్రపంచంలో ఆ పసిమొగ్గల్ని మీకు నచ్చిన కృత్రిమ పువ్వుల్లా మలుచుకొంటున్నారు. అంతేకానీ, ఆ పువ్వులు రంగు, వాసన, సున్నితత్వం, సహజత్వం కోల్పోతున్నాయని మీరు గుర్తించడమే లేదు.''

నిజానికి అక్కడ చేరిన వారికి ఉపన్యాసాలు వినే ఓపిక లేదు. తమ యిష్టాయిష్టాల ప్రమేయం లేని తప్పని సరి పరిస్థితి ఏర్పడడంతో పైపర్‌కు చెవులప్పగించారు.

పైపర్ చిట్టి వాళ్ళమ్మ వైపు తిరిగాడు, ''చిట్టికి బడి పుస్తకాలు ముఖ్యమే. కానీ చదువు అక్కడికే పూర్తవదు. ఆ బౌండు పుస్తకాల్లో బంధించబడని చదువును ప్రకృతి నేర్పుతుంది. చెట్లు పుట్ట గుట్ట మిట్ట ఇవి నేర్పుతాయి చదువును. కల్పన ప్రకృతికి ప్రియపుత్రిక. కల్పనామయ ప్రపంచం మాది. అయితే, చదువుల చట్రం బిగించి, ఊహల రెక్కలు తెంపి, సృజనకు సంకెళ్ళు వేసి భావాలను బంధించి మూసల్లాగా తయారుచేయడం ఏ మాత్రం సబబు?''

చిట్టి వాళ్ళమ్మ ఏమీ మాట్లాడలేదు.

''అయితే ఏంటయ్యా? మా పిల్లల బాగోగులు మాకు తెలియదంటావా? పేద్ద చెప్పొచ్చావ్!'' కాస్త గట్టిగానే కసురుకొన్నాడు ఒకాయన.

ఒక్కసారిగా గుంపులో గుసగుసలు మొదలయ్యాయి.

పైపర్ తీవ్రంగా స్పందించాడు-

''నిజమే. మీకు తెలియంది ఏముంది? తెలిసితెలిసే పిల్లలశ్రమ శక్తిని దోపిడీ చేస్తున్నారు. తెలిసితెలిసే వారి అమాయకత్వాన్ని దోపిడీ చేస్తున్నారు. దోపిడి-నిలువుదోపిడి-విచ్చలవిడిదోపిడి-తెలిసితెలిసే ఈ ఫ్యాక్టరీలు - కంట్రాక్టర్లూ-బ్రోకర్లూ-'' పైపర్ గొంతు తడి కట్టింది. ఆ పైన మాట పెగల్లేదు.

ఎక్కడి వారక్కడ నిశ్శబ్దంగా నిలుచుండిపోయారు.

కాసేపటి తరువాత - బొంగురు గొంతుతో పైపర్ అన్నాడు- ''బంగారు బాల్యం అని అంటూ వుంటారే... ఈనాడు బంగారం విలువ తెలిసినంతగా బాల్యం విలువ మనకు తెలియకపోవడం ఎంత విషాదం!''

కొందరు తలాడించారు. మరికొందరు తలదించుకొన్నారు. ఇంకొందరు తలలుపట్టుకున్నారు.

''పిల్లల గురించి ఆలోచించ వలసిన అత్యవసర పరిస్థితి ఒక్కటి వుందని మీరు భావిస్తే - అది ఈక్షణమే.

ఎందుకంటే...పిల్లల గురించిన నిర్ణయాలు తీసుకోవడంలో ఓ క్షణం ఆలస్యం చేసినా - ఒక తరం ఆలస్యం అవుతుంది కనుక.

మీకు వెయ్యి సమస్యలు వుండొచ్చు. వాటికి పిల్లల్నీ ఎరకానివ్వకండి.

ఒక చిన్ననాటి అసంతృప్తి లోంచే హిట్లర్ తలెత్తాడు. ప్రపంచాన్నే విషాదంలో ముంచే అలాంటి పిల్లల కథ పునరావృతమవ్వకుండా జాగ్రత్త పడాల్సింది నేడే.

మమ్మల్ని పిల్లల కోసమే సృష్టించిందే మీరు. మా తాపత్రయమంతా ఈ

ప్రయత్నమంతా పిల్లల సంతోషం కోసమే, మమ్మల్ని సావధానంగా అర్థం చేసుకొంటారుగా!

ఇక, మా అందరి అభ్యర్థన నివేదన ఒక్కటే - పిల్లల్ని పిల్లలుగానే ఎదగనీయండి.

పిల్లల గురించి ఆలోచించండి - ప్రేమతో ఆలోచించండి.

మేము పిల్లల కల్పనలను రంగులమయం చేయడానికి వేయికళ్ళతో వేచివుంటాం! "

పైపర్ చేతులు జోడించి ముగించాడు.

తమ చిన్నారి మిత్రుల్ని వారివారి యిళ్ళ వద్ద వదలలేక వదిలి - అప్పుడే అక్కడికి వచ్చిన మిగిలిన వారంతా - పైపర్ తో మౌనంగానే ఏకీభవించారు.

అంతదాకా పెదవి విప్పని పెద్దల మదిలో ఏముందో ఏమో కానీ - తిన్నగా యిళ్ళకు మళ్ళారు-

మౌనంగానే!

ఈనాడు - ఆదివారం - 10-11-1996